# సృష్టి

సంగీతం రాళ్ళని కరిగిస్తుందో లేదో తెలీదుగాని, జగన్నాథాన్ని మాత్రం కరిగించి, అతడిలో ఆనందాన్ని ప్రవహింప చేసి, మనసు చేత పరవళ్ళు త్రొక్కిస్తుంది.

జగన్నాథానికీ బాధ ఇప్పటిదికాదు. చిన్నప్పట్నించి వుంది. బాధకి, సంతోషానికి తేడా తెలీని వయస్సులోనే, సంగీత కచేరినికడదాకా వినేవాడు. అర్థమైనట్లు తలాడించేవాడు. కవితలు, రాగాలు ఎడతెగని దీర్ఘాలు శ్రావ్యమైన గళాల నుంచి వింటుంటే అతడికి రక్త ప్రసరణ వేగం పెరగేది. గుండె క్రింద ఏదో చల్లగా కదిలినట్లుగా అనిపించేది. తెలీకుండానే కళ్ళలో నీళ్ళు తిరిగేవి. తననితాను మరిచేవాడు.

విచిత్రంగా సంగీతంపట్ల బాల్యంలో మొదలైన ఇష్టం అతడితో పాటుగా పెరిగింది. తీగలు సాగి, ఆకులు వేసి, మొగ్గలు తొడిగి మనసుచుట్టూ వెచ్చటి, పచ్చటి పందిరి వేసింది.

ప్రపంచంలో కొన్నిటిని ఎంతో మందికి పంచటానికి కొంతమంది పుడతారు. వాటినందుకుని ఆస్వాదించి ఆనందించటానికి మరో కొంతమంది పుడతారు.

జగన్నాథం వాటినందుకోటానికి పుట్టిన వాళ్ళలో ఒకడు. చక్కటి కృతిని, రాగపరంగా లయబద్ధంగా, కోయిలగొంతుతో ఎవరైనా పాడగలిగితే దాదాపు ఆరడుగుల ఎత్తు, ఆరవై కిలోల బరువుగల జగన్నాథం దూది పింజలా మారి పోయి, ఆనందపు టాకాంశంలో విహరించేస్తాడు. ఆ క్షణంలో అతడికి ఈ ప్రపంచం, మనుషులు, కుళ్లు కల్మషాలు, బాధలు, కష్టాలు, కన్నీళ్లు, కపటాలు, కుట్రలు, ఏవీ గుర్తుకురావు.

కాని అటువంటి అమృతక్షణాలు చాలా అరుదుగా లభిస్తాయి. సంగీతం పేర పుట్టుకొస్తున్న సినిమా పాటలుగాని, పాప్‌మ్యూజిక్కులు గాని అతడినుత్తేజ పర్చలేవు సరికదా, ఆ పొలిమేరలని గూడా తాకలేవు.

నగరాల్లో వుంటున్న పల్లెటూరివాడిలా వెర్రి వెర్రిగా చూస్తూ తనక్కావలసిన అనుభూతి కోసం మనసుకి వెయ్యికళ్ళని తగిలించుకుని చూస్తుంటాడు.

ఆరోజు, ఆ సాయంత్రం మసక చీకట్లు ముసురుకుంటున్న వేళ, చల్లగాలి చందమామతో సరసాలాడుతుండగా, అప్పుడే కంపెనీ నుంచి వచ్చిన జగన్నాథానికి ఎదురుచూస్తున్న అనుభూతి అనుకోకుండా, అకస్మాత్తుగా ఎదురైంది.

గది తలుపులు తెరచి లోనికెళ్ళి ప్యాంటు షర్టు విడిచి లుంగీ కట్టుకోవాలను కుంటుండగా  వినిపించింది.

తియ్యటి పాట– సన్నటి గొంతులో. హాయిగా చల్లగా, చక్కగా అమృతధారలాగా వినిపించింది.

జగన్నాథం చేతిలోని లుంగీ జారి క్రింద పడింది. శరీరం కుర్చీలో పడింది. ఆ రెండు విషయాలు అతడికి తెలీవు. ఆ పాట సూటిగా అతడి గుండెని తాకింది. చాలాకాలం తర్వాత మనసుని స్పందింపచేసిన పాట కావటం చేత తనని తాను మర్చిపోయేడు.

అన్నమాచార్యుని కీర్తన ప్రక్కింటి ఆడపిల్ల గొంతులోంచి అతి మధురంగా తెరలు తెరలుగా వినిపిస్తోంది.

జగన్నాథం తమకంతో తలూపుతూ, చిన్నగా తాళం వేస్తూ వింటున్నాడు. కొద్దిక్షణాలకి ఎంత ఆకస్మాత్తుగా వినిపించిందో, అంతే అకస్మాత్తుగా ఆగిపోయింది– ఆ అమృతగానం.

ఆ క్రూరమైన నిశ్శబ్దంలో ఎవరో ఆడమనిషి ఎవర్నో ఘోరంగా తిడుతున్నట్లుగా వినిపిస్తోంది

జగన్నాథం కళ్ళు తెరిచాడు అతడి మొహంలో కోపం, నిరాశ, నిస్పృహ, చోటు చేసుకున్నాయ్. ఒక్కసారిగా ప్రక్కభాగంలోకి సుడిగాలిగా వెళ్ళి పాటపాడిన దేవతని, అది ఆగిపోవటానికి కారణమైన రాక్షసిని చూసిరావాలన్నంత ఆవేశం

వచ్చింది. కాని తమాయించుకున్నాడు. తనని తానే సముదాయించుకున్నాడు.

అతడాగదిలో కొచ్చి పదిరోజులే అయింది.

ఈ పదిరోజుల్లో ప్రక్కభాగంలో ఎవరుంటారో, ఎంతమందుంటారో గమనించే వీలుగాని, వ్యవధిగాని చిక్కిందికాదు.

జగన్నాథం ఉద్యోగం అలాంటిది.

తెల్లవారక మునుపే కంపెనీకెడితే, చీకటి పడ్డాకగాని గదికి చేరడు. పుస్తకం చదువుతూనో, టేపులో పాటలు వింటూనో తనకి తెలీకుండానే నిద్రలోకి జారిపోతాడు. తెల్లవారితే మళ్ళీ వురుకులు, పరుగులు.

కాని ఆరోజు తననికదిలించిన పాటవిన్నాక ఆ మధురగాయని రూపాన్ని కళ్ళారా చూడాలన్న తహతహ మొదలైంది. అప్పట్నించే అతడు కంపెనీనుంచి కాస్త త్వరగా వస్తున్నాడు. రోడ్లవెంట తిరగటం, బాతాఖానీలు కొట్టటం మానేసి సరాసరి గదికొచ్చేస్తున్నాడు. కిటికీరెక్కలు తెరచి పెట్టి ప్రక్కవాటాలోకి వచ్చి వెళ్ళేవారిని ఆసక్తిగా గమనించసాగేడు.

సన్నపాటి ఆలాపనలు, కూనిరాగాలు, సరిగమల సాధనలు తప్ప పూర్తి పాట వినే అదృష్టం కల్గిందికాదు. అయినప్పటికి జగన్నాథం చెవులకవి ఉపవాసం పేరిట తినే ఫలహారంలా హాయిగా, సుష్టుగానే వున్నట్లనిపించింది. అంత కమ్మగా, తియ్యగా, మత్తుగా పాడాలంటే ఎన్నో సంవత్సరాల అనుభవమున్నా, లేక ఎన్నో జన్మల పుణ్యమన్నా వుండాలి. మరెవరికి సాధ్యమయ్యే పనికాదు. కాబట్టి అటువంటి అమృత మూర్తిని చూసితీరాలి– తప్పదు.

జగన్నాథంలో ఆత్రంలాటి పంతం మొదలైంది.

ఆరోజు ఆదివారం– కంపెనీకి సెలవు.

జగన్నాథం పేపరు పుచ్చుకుని కిటికీ ప్రక్కన కుర్చీలో కూర్చునున్నాడు. అతడుంటున్నది డాబా ఇల్లు. కొత్తగా కట్టిన ఇల్లని ఇట్టే చెప్పొచ్చు. డాబాపై కెళ్ళటానికి మెట్లుగాని, ప్రక్కల్ని ప్రహారీగోడకాని లేవు. ఇంటికెదురుగా మట్టితో గోడకట్టి ఇనుపగేటు బిగించబడివుంది. ముందు విశాలమైన ఆవరణ, గేటునించి ఇంటిమెట్లవరకు పరిచిన నాపరాళ్ళు, ఒక్కపక్కన బావి, మరో ప్రక్కన మిగిలిపోయిన ఇసుక దిబ్బ వున్నాయ్. వసారాకానుకునున్న గదిలో జగన్నాథం వుంటున్నాడు. ఇంకా లోపలెన్నిగదులున్నాయో ఎంతమందుంటారో, ఏం చేస్తుంటారో, ఎలా వుంటారో మొదలైన వివరాలు అతడికి తెలీవు. తెల్సుకోవాలకున్న ఆలోచన ఆ రోజు పాట విన్న క్షణానే మొదలైంది.

బావిలోంచి నీరు తోడుకునేవారు, అతడి గది కిటికీలోంచి చూస్తే స్పష్టంగా కనిపిస్తారు.

అందుకే జగన్నాథం ఆ రోజు అక్కడ పెట్టేడు దుకాణం.

అంతలో బావి గిలక చప్పుడైంది. అతడు ఆత్రంగా అటువైపు చూసేడు.

ఆమెకి ఇరవై ఏళ్ళ వయసుంటుంది. ఎర్రగా వుంది. కనుముక్కు తీరు తీర్చిదిద్దినట్లు అందంగా వున్నాయ్. నుదురు చిన్న గాను, నోరు వెడల్పుగా వున్నా కొంతమందికి బావుంటాయనటానికామే సాక్ష్యం. ఆమెలో వయసు విచ్చుకుని పరవళ్ళు త్రొక్కుతోంది.

ఆమె వొంగుని నీళ్ళుతోడుకుంటూ సన్నగా కూనిరాగం తీస్తోంది. జగన్నాథానికి గదిలోంచి చూస్తుంటే ప్రక్కనించి కన్పిస్తున్న అందాలు వెచ్చగాను, తెరలు తెరలుగా వినిపిస్తున్న కూనిరాగం మత్తుగాను వున్నట్లనిపించింది.

ఆ రోజు అంత మధురంగా పాడిన వ్యక్తి ఈమేనా? అడిగేస్తే?

ఆమె నీళ్లు తోడుకుని బిందెని నడుంపై వుంచుకుని వెళ్ళబోతోంది.

జగన్నాథం ఆలస్యం చెయ్యలేదు.

ఒక్క అంగలో గదిలోంచి బయటికొచ్చేడు. వెళ్ళిపోతున్న ఆమెనుద్దేశించి "ఎక్స్ క్యూజ్‌మీ– మీరు పాటలు పాడతారా? అనడిగాడు.

ఆమె బరువుగా కళ్ళెత్తి అతడివైపు భయం భయంగా చూసింది.

సమాధానం కోసం ఎదురు చూడకుండా మళ్ళీ అతడే అన్నాడు.

"ఆరోజు మీ పాట విన్నాను. అద్భుతంగా పాడేరు. అలా మీరు పాడుతూ వుంటే నేనీ ప్రపంచాన్ని మర్చిపోతాను. ఇప్పుడు నేను మీ అభిమానిని" గడగడా పాఠం వొప్పు చెప్పినట్లుగా అనేస్తాడు.

ఆమె సన్నగా నవ్వి తలదించుకుని పూచిన పూతీగల కదిలి వెళ్ళిపోయింది.

జగన్నాథం తిరిగి గదిలోకొచ్చేడు. ఇప్పుడు అతడి మనసు ప్రశాంతంగా వుంది. సంతోషంగా వుంది.

చక్కటి గొంతు– అంతకుమించిన అందమైన రూపం–

దేవుడిక్కూడా అభిరుచి, రసికత్వం వున్నాయ్. కాకపోతే అందమైన సృష్టి ఇంత అందంగా చెయ్యలేడు– ఈ అపరంజి బొమ్మని సొంతం చేసుకునేవాడు నిజంగా అదృష్టవంతుడే.

అవునూ– ఆ అదృష్టవంతుడు తనే ఎందుక్కాకూడదూ?

జగన్నాథం ఆలోచన్లోంచి పూర్తిగా బయటపడక మునుపే మళ్ళీ ప్రక్కభాగంలో పాట వినిపించింది.

"ఆకులో ఆకునై, పూవుల్లో పూవునై..."

మధురమైన క్రిష్ణశాస్త్రిగారి కవిత్వానికి మృదువైన, తియ్యటి ఆలాపన. తెరలు తెరలుగా హాయిహాయిగా తియ్యతియ్యగా వినిపిస్తుంటే భగవసాక్షాత్కారం పొందిన భక్తుడి లాగా కూర్చుండిపోయేడు.

కొద్ది క్షణాలకి పాటాగింది కాని జగన్నాథంలో ఆవేశం, సంతోషం ఆలోచన్లు ఆగేయికావు.

ఆ పాటని, ఈ సంతోషాన్ని, ఆ మనిషిని తన సొంతం చేసేసుకోవాలి. అప్పటిగ్గాని తన బతుక్కి సార్థకత లేదు–

అని జగన్నాథం ఏకపక్ష నిర్ణయం తీసేసుకున్నాడు. తన నిర్ణయాన్ని అమలు పర్చుకునే మార్గాల కోసం, అవకాశం కోసం ఎదురుచూస్తూ రోజుల్ని బరువుగా లాగుతున్నాడు.

ఒకరోజు–

అతడు కంపెనీ నుంచి వచ్చేసరికి ఆమె గేట్లోనిల్చునుంది. తనని చూసి లోనికి పెరిగెడుతుదేమోనని భయపడ్డాడు–.

కాని ఆమె అలాగే కదలకుండా నిల్చునుంది– జగన్నాథం ఆమెని దాటి లోనికెళ్ళబోతూ 'ఆ క్రిష్ణశాస్త్రిగారి పాట– ఆకులో ఆకునై... ఇంకో సారి నాకోసం పాడరూ– ప్లీజ్' అన్నాడు. చిన్న పిల్లవాడు తల్లిని మరోలడ్డూ పెట్టమని మారాం చేస్తున్న ధోరణిలో.

అంతకు మునుపు తాను తీసుకున్న నిర్ణయానికి తనకితాను పెట్టుకున్న పరీక్షలాగా భావించి అలా అడిగేడు.

ఆమె తుర్రున లోనికి పరిగెత్తింది.

కొద్దిక్షణాలకి ఆశించినదానికంటే మధురంగా పాట వినిపించింది– జగన్నాథానికి ధైర్యం వచ్చింది... వాళ్ళ పరిచయం పెరగసాగింది.

ప్రతి సాయంత్రం అతడి కోసం ఆమె ఎదురు చూస్తూ నిల్చుంటుంది. కళ్ళతోనే పలకరించుకుంటారు. చిరునవ్వులతో ప్రశ్నించుకుంటారు. అప్పుడప్పుడు రహస్యంగా 'ఫలానా పాట' కావాలంటాడు. ఆమె లోనికెళ్ళి గానం చేస్తుంది.

ఆమెపేరు గౌరి– తండ్రి చిన్నతనంలోనే పోయాడు. అష్టకష్టాలు పడి పెంచిన తల్లిగూడా ఇటీవల పోయింది. ప్రస్తుతం అన్నగారి సంరక్షణలో వుంటోంది. ఆమె అన్న డిఫెన్స్ ఎకౌంట్స్‌లో సెక్షనాఫీసరు, డిపార్టుమెంటు దోషమో ఏమోగాని ఇంట్లో మిలటరీ డిసిప్లిన్ అమలు చేస్తాడు. ఆడవాళ్ళు బయటకు రాకూడదు. ఎవరితోను కబుర్లు చెప్పకూడదు– పరిచయాలు చేసుకోకూడదు– ప్రస్తుతం అతడు చెల్లెలి పెళ్ళి ప్రయత్నాల్లోనే వున్నాడు.

ఇవన్నీ జగన్నాథం అతికష్టంపై అనేక సందర్భాల్లో ఆమెనించి రాబట్టిన సమాచారం.

తనని పెళ్ళాడాలంటే అన్నగారితో మాట్లాడాలంది.

జగన్నాథం మాట్లాడేడు.

జగన్నాథానికి పెళ్ళయింది.

ఆరోజు రాత్రి అతడి దాంపత్య జీవితానికి సరిగమలు పలికేరాత్రి–

జగన్నాథం గదిలో పచార్లు చేస్తున్నాడు. తెల్లటి గ్లాస్కోపంచె–బనీను– చేతిలో సిగరెట్టు ఆలోచిస్తూ తిరుగుతున్నాడు.

గౌరీని ఓపాట పాడమనడగాలి?క్రిష్ణశాస్త్రి సాహిత్యమా లేక పుష్పవిలాపంలో పద్యాలా? ఛఛ– విలాపం ఏమిటి అసందర్భంగా – మరేమిటి– అసలు పాడుతుందా లేక వెర్రి వెధవని చూసినట్లుగా చూస్తుందా–

జగన్నాథం అలా ఆలోచనల్లో వుండగానే, గౌరి గదిలో కొచ్చింది. తెల్లచీరె, తెల్లబ్లౌజు, మల్లెపూలు, మెరుగులు దిద్దుకున్న వయసు– అపర రతీదేవిలా వుంది. ఆమె అతడికొస్త దూరంగా తలొంచుకు నిల్చునుంది.

జగన్నాథం చొరవగా వెళ్లి గది తలుపులు మూసి గడియపెట్టి గౌర భుజాలచుట్టూ చేతులేని ఆమెను తనవైపు తిప్పుకున్నాడు. ఆమె భుజాలు మెత్తగాను, ఆ స్పర్శ హాయిగాను వుంది. ఇంకా స్తముందుకెళ్ళి మరికాస్త హాయిని, అనుభూతిని పొందాలనుకుని గూడాచట్టుకున ఆగిపోయాడు.

గౌరీకళ్ళలో గంగ!

జగన్నాథానికర్థం కాలేదు కారణమేమిటో.

"ఛ– ఏమిటది" అన్నాడు ఆమెని మరింత దగ్గరగా తెచ్చుకోవాలని ప్రయత్నిస్తూ–

"మీరు నిజంగా దేవుళ్ళు– " అందిబెక్కుతూ

జగన్నాథం గలగలానవ్వేడు.

"ఓహో– అంటే కట్నం పుచ్చుకోకుండా నిన్ను చేసుకున్నందుకా– నిజానికి నేనేనీకెదురు కట్నం ఇచ్చుకోవాలి. ఇంత అందమైన కోయిలని కట్టుకోవాలంటే మాటలా?' అన్నాడు.

గౌరి చటుక్కున అతడి కాళ్ళపైకి జారింది–

"నన్ను క్షమించండి" అంది ఏడుస్తూ.

అప్పుడు జగన్నాథంకాస్త కంగారుపడ్డాడు.

"గౌరీ ఏమిటిది– చిన్నపిల్లలాగా"

"నేను – మీకో సంగతి చెప్పాలి" అంది.

జగన్నాథం ఆమెను లేవనెత్తి– "సంగతులు తర్వాత– ముందు మంచి పాటపాడు– జోలపాట మాత్రంకాదు" చిలిపిగా నవ్వుతే అన్నాడు.

గౌరి బేలగా అతడివైపు చూస్తూ "దాన్ని గురించే నే చెప్పాలన్నది– ఇన్నాళ్ళూ మీరింతగా మెచ్చుకుంటున్న ఆ గొంతు నాదికాదు" అంది.

ఆ మాట విని జగన్నాథం వులిక్కిపడ్డాడు.

"గౌరీ అంటే..."

"అవునండీ– ఆ పాటలు పాడేది మా అక్క సుభద్ర–

జగన్నాథం. చేష్టలుడిగి నిల్చుండిపోయేడు ఆమె చెపుతున్నది నిజమా అని రెండు క్షణాలు సందేహించి... 'ఏవిటి– నీకో అక్కయ్యుందా– మరెప్పుడూ చెప్పలేదే– పెళ్ళిలో గూడా చేసిన గుర్తులేదు" అన్నాడు.

"అవును– పెళ్ళిలో గూడా అదెవరికి కన్పించలేదు"

“కారణం”

గౌరి రెండు క్షణాలు భర్తవంక చూసి, అతడిచెయ్యి పుచ్చుకుని ‘ఇలా రండి’ అంటూ కదిలింది. జగన్నాథం ఆమె వెంటే వెడుతునానడు. ఆమె గది తలుపుతీసి వరండాలోకెళ్ళి ప్రక్కనున్న మరో గది తలుపునెట్టి అతడిని ఆ గదిలోకి తీసుకెళ్ళింది.

ఆగది చీకటిగా వుంది. ఇన్నాళ్ళు జగన్నాథం అద్దెకున్న గదికి అనుకునున్నది.

జగన్నాథం ఏవీ అర్థంకాక అయోమయంగా చూస్తున్నాడు.

గౌర ఆ గదిలో దీపం వేసింది. కాంతి గదంతా పరచుకుంది.

సుభద్ర, గౌరీ అక్క మొదటిసారిగా జగన్నాథం దృష్టిలో పడింది.

ఆమె గోడవారగా, పాతచీరెలగుట్టపై, ముడిచి పెట్టుకుని పడుకునుంది.

గదిలో దీపం వెలగ్గానే తుళ్ళిపడి లేచి కూర్చుంది.

ఆమెని చూసేక జగన్నాథానికర్థమైంది పెళ్ళికి పూర్వం గౌరి తనకో అక్క వున్న సంగతి ఎందుకు చెప్పలేదో, పెళ్ళిలో నలుగురి మధ్యకి ఎందుకు రాలేకపోయిందో.

సుభద్ర వొంటిపైని చర్మాన్ని ఎవరో పనిగట్టుకుని వొలిచేసినట్లు శరీరమంతా తెల్లగా... జుట్టు వెండిజట్టులాగా, కనుబొమలు, రెప్పలు తెల్లటివింజామర్లులాగా... పనికిరాదని దూరంగా పారేసిన పాలరాతి అమ్మవారి విగ్రహంలాగా– అందరికి దూరంగా– అన్నిటికి దూరంగా– వుండిపోయింది.

సుభద్ర మొహాన్ని రెండుచేతుల్లోనూ దాచుకుంది బాధవల్లనో, అసహ్యంవల్లనో.

“ఇదే మా అక్క సుభద్ర– మీరుకావాలనన పాటలన్నీ ఇన్నాళ్ళు నాకోసం పాడి, మిమ్మల్ని పరవశింపజేసింది.”

జగన్నాథం అక్కడ నిలబడలేకపోయాడు. చరచరా తిరిగి తనగదిలోకొచ్చేడు. అతడికే దోలావుంది. విసర్జించాల్సిన వాటిని గుండెలకి పూసుకుంటున్నట్టు పవిత్రమైన వాటిని పాదాల క్రింద వేసి తొక్కుతున్నట్లు ఏమిటోలా వుంది. ఇన్నాళ్ళుతను ముచ్చటపడిందీ సుభద్ర పాట వినా– కాని గౌరి ఎందుకలా నడించింది బొంకింది?

స్వార్థం!

తను ముచ్చటపడ్డ ఆగొంతునడ్డంపెట్టుకుని తన గొంతుకి మూడుముళ్ళు వేయించేసుకుంది. తర్వాత తెల్సినా ఫర్వాలేదని భావన.

గౌరీ చేసిందితప్పా? మనిషికి స్వార్థం తప్పా?”

తనది స్వార్థంకాదా? ఆ పాటవిని ఆనందించి వూరుకోక సొంతం చేసుకోవాలని ఆశపడింది స్వార్థం చేతకాదా?

గౌరీ గదిలో కొచ్చింది– అతడి కాళ్ళపై వాలింది.

“నన్ను క్షమించండి– నాకెన్నో సంబంధాలొచ్చేయి కాని అందరూ అక్కయ్యని చూసి భయంతో పారిపోయేరు. ఇకనాకు పెళ్ళికాదని దాని బొల్లికి నాజీవితం కూడా బలికాక తప్పదని అనుకుంటుండగా మీరొచ్చేరు– ఆశలు రేకెత్తించారు.

“స్వార్థంతో కావాలని మిమ్మల్ని మభ్యపెట్టాను. అన్నయ్య చెప్పేద్దామంటే నేనే కూడదని, పూర్తి బాధ్యత తీసుకున్నాను. మొదటి సారి మీరు పలకరించినపుడే మనస్సులో మీ ముద్రవేసుకున్నాను. పెళ్ళంటూ అయితే ఫలానా వ్యక్తి భార్యగా అందరూ అనుకుంటుంటే ఆ అనుభూతి ఎలా వుంటుందో చవి చూడాలన్న దురాశతో మిమ్మల్ని మోసం చేసాను. తప్పంతా నాది– కొట్టండి– తిట్టండి– అసహ్యించుకుని వెళ్ళిపొండి... ప్లీజ్”

గౌరి వెక్కి వెక్కి ఏడుస్తోది.

జగన్నాథం ఆమెని సుతారంగా లేవనెత్తాడు.

"గౌరీ – ఇందులో క్షమించటానికేముందని? స్వార్థంలేని మనిషెవడు– కమ్మగాపాడుతున్న వ్యక్తిని సొంతం చేసుకోవాలని నేనాశపడ్డాను దాన్నడ్డం పెట్టుకుని  అనుభూతికోసం చిన్న అబద్ధం ఆడేవ్– నువ్వే గెల్చావ్– కాని నేనోడిపోలేదు"

గౌరి తలెత్తి అర్థంకానట్లు చూసింది.

"అవును– నేనభిమానించే ఆకంఠంనాతోనే వుంటుంది. సుభద్రని గూడా మనతో తీసికెడదాం సరేనా"

గౌరీ అతడ్ని విడిపించుకునెళ్ళి తలుపు మూసింది. పాలగ్లాసుని తెచ్చి భర్తకందించింది కొంగుతో కళ్ళు తుడుచుకుంది. పూలచెండుని, చీరకుచ్చెళ్ళని సరిచూసుకుంది.

గౌరికిప్పుడు ధైర్యం వచ్చింది.

జగన్నాధం పాలుత్రాగేసి గ్లాసుని చేతికందిస్తూ మళ్ళీ అన్నాడు.

"సుభద్రని గూడా మనతోనే వుంచుకుందాం– ఏమంటావ్?" గౌరి మెల్లిగా అంది–

"వదిన రోగిష్టిమనిషి– చాకిరీ చేసుకోలేదు– సుభద్రని మనం తీసికెడిత

పన్లెవరు చేస్తారు? అదీ కాక– మీకోసం అనేకమంది స్నేహితులొస్తుంటారు– వాళ్ళంతా దీన్ని చూసి అసహ్యించికుని భయంతో రావటమే మానేస్తారు. అయినా అన్నయ్య దాన్నెక్కడికి పంపడు– అందుకని దాన్ని గురించి ఆలోచించకండి."

దాని ఖర్మది– మనమేం చేస్తాం.

'ఆకులో ఆకునై... పూవులో పూవునై

ఈ అడవి దాటిపోనా"

ప్రక్క గదిలోంచి పాట తెరలు తెరలుగా వినిపిస్తోంది.

కాని ఆపాట ప్రతిరోజులా లేదు.

ఏదో చెప్పలేని బాధని చెబుతున్నట్లు, గుండెల్లో చీకటిని తోడేసుకుంటున్నట్లు, దుఃఖాన్ని ఆపుకుంటున్నట్లు అస్తవ్యస్తంగా వుంది.

జగన్నాధం గుండెపొరల్లో సుభద్ర–

జగన్నాధం కళ్ళల్లో నీళ్ళు–

అవును–

సృష్టి చిత్రమైంది.